క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఎంపికలు



పోటీలు ప్రారంభించిన ఎంఈఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గుగులోతు రంగానాయక్ మండలస్థాయి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పది మందిని ఎంపిక చేశామన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిస్తే స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికై నట్టేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, పీఈటీలు శ్రీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



ప్రశంసాపత్రం అందజేస్తున్న శేషారెడ్డి

ములుగు(గజ్వేల్): అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్, స్విమ్మింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన మండలంలోని లక్ష్మక్కపల్లి వెరిటాస్ స్కూల్ విద్యార్థులు సహస్రా సాన్వి, అఖిల్‌ను పాఠశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సన్మానించింది. పాఠశాల చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని ధర్నా



తహసీల్దార్ ఎదుట బైఠాయించిన మహిళలు

కోహెడ(హుస్నాబాద్): తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతూ రామచంద్రపూర్‌కు చెందిన గౌడ కులస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబరు 390లోని 0.14 ఎకరాల భూమిని 20 యేళ్ల నుంచి కాపాడుకుంటూ వచ్చామన్నారు. ఆ భూమిలో ముగ్గురు రైతులు తమ పశువులను ఉంచుకోడానికి వినియోగిస్తున్నారని, అయితే ఎల్లమ్మ ఆలయం నిర్మించేటప్పుడు ఖాళీ చేస్తామని సాధాబైనామా రాసిఇచ్చారని చెప్పారు. ఇప్పుడు తమదే అంటున్నారని, మోకా విచారణ జరిపించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

మల్లన్న సాగర్‌లోకి దిగొద్దు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ఎస్ఐ శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): అనుమతి లేకుండా ఎవరూ మల్లన్న సాగర్ ప్రాజెక్టులోకి దిగవద్దంటూ ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. కొండపాక, కుకునూరుపల్లి సరిహద్దు శివారులో నిర్మించిన మల్లన్న సాగర్ ప్రాజెక్టు వద్ద మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ నీటి ఉధృతి పెరిగిందని, స్నానాలు చేసేందుకు, చేపలు పట్టేందుకు, ఈత కొట్టేందుకు దిగితే చాలా ప్రమాదకరమన్నారు. పెద్ద పెద్ద మొసళ్లు కూడా ఉన్నాయని, తమను సంప్రదించకుండా మల్లన్నసాగర్‌లోకి దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైద్యుల సూచనతో టీబీ దూరం

గజ్వేల్‌రూరల్: వైద్యుల సలహాలు, సూచనలు పాటించి టీబీని తరిమికొడదామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ పీహెచ్‌సీలో టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం టీబీ(ట్యూబర్ క్లోసిస్) వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిని మొదటి దశలోనే గుర్తించినట్లయితే పూర్తిగా అరికట్టవచ్చన్నారు. టీబీ రహిత జిల్లాగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, వైద్యులు ప్రణయ్‌కుమార్, బల్బీర్‌సింగ్, రాజశేఖర్, మహారాజ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు.. ప్రజల వెతలు

చిన్నపాటి గాలి వీచినా..
చినుకు రాలినా.. కరెంట్ కట్
- గంటల కొద్దీ సరఫరా నిలిపివేత
- అంధకారంలో గ్రామాలు

చిన్నపాటి గాలి వీచినా.. చిన్న చినుకు రాలినా గ్రామాలను అంధకారం అలముకుంటోంది. 24 గంటలపాటు నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తున్నామని నాయకులు ప్రకటిస్తున్నా కొన్నిచోట్ల అది అమలు కావడంలేదు. తేలికపాటి గాలులు వీయడం .. చిన్న వర్షం కురవడాన్ని అదనుగా తీసుకుని సరఫరా నిలిపి వేస్తున్నారు విద్యుత్ అధికారులు. గంటల తరబడి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో 33–11 కేవీ సబ్ స్టేషన్లు 12 ఉన్నాయి. అవి సక్రమంగా పనిచేస్తున్నా ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలులు, వర్షాలకు ఏ ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు ముందస్తుగా విద్యుత్ నిలిపివేయడం సరైనదే. కానీ మరీ చిన్న చిన్న గాలులకు కూడా విద్యుత్ నిలిపివేయడం, ఆ తర్వాత గంటల తరబడి విద్యుత్ ఇవ్వడంలేదని వారు ఆరోపిస్తున్నారు.

లూజు వైర్లతో ఇబ్బందులు

గాలి, వాన తగ్గినా సకాలంలో విద్యుత్ సరఫరాను



మాచాపూర్ సబ్‌స్టేషన్

పునరుద్ధరించడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సబ్‌స్టేషన్ నుంచి గ్రామాలకు విద్యుత్‌ను అందించే విద్యుత్ స్తంభాలు, తీగలు చాలా యేళ్ల కిందట ఏర్పాటు చేసినవి. తీగలు కూడా కిందికి వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభాల కిందనే హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి తీగలకు తగలడంతో కరెంట్ ట్రిప్పవుతోంది. దీంతో విద్యుత్ అధికారులకు కూడా ఈ సమస్య ఇబ్బందికరంగానే మారిందని చెబుతున్నారు.

ఆ తీగలు యమపాశాలు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయ పొలాల గుండా వెళ్లే విద్యుత్ తీగలు చేతికి అందేంత ఎత్తులోనే ఉంటున్నాయి. వేలాడుతున్న ఆ తీగలు తమ పాలిట యమపాశాల్లా మారాయని మండల పరిధిలోని జంగపల్లి రైతులు వాపోతున్నారు. గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చాకలి లక్ష్మీనర్సయ్య, కర్ల సత్తయ్య, చాకలి ప్రసాద్, గాడి పోచయ్య వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ తీగలు తలకు తాకేంత ఎత్తులో ఉండి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయని మండిపడుతున్నారు. వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు చేసుకునే సమయంలో ఆ తీగలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులవుతున్నారు.

అధికారుల స్పందన కరువు

విద్యుత్ తీగలు తెగి పడటంతో గతంలో రెండు సార్లు తృటిలో ప్రమాదం తప్పిన ఘటనలు ఉన్నాయి. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి స్పందన కరువైందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట పొలాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలను సరి చేయాలని కోరారు.



చేతికి అందేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

వైర్లు సరిచేయాలి..

గ్రామాల్లో ముఖ్యంగా లూజు వైర్లతోనే సమస్య ఎదురవుతోంది. విద్యుత్ అధికారులు ముందుగా తీగలను సరిచేయాలి. రాత్రి సమయంలో అంతరాయం ఏర్పడితే ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.

– సంతోష్, అల్లీపూర్

సమస్య పరిష్కరిస్తాం..

గాలులు వీచినప్పుడు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటాం. చెట్ల కింద ఉండే తీగలపై కొమ్మలు విరిగిపడితే సబ్ స్టేషన్‌లో ట్రిప్పవుతోంది. దానిని పరిష్కరించేందుకు సమయం పడుతుంది. అందుకే సబ్‌స్టేషన్‌లలో ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. అన్నీ పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం.

– చాంద్‌పాషా, విద్యుత్ ఏఈ

ఆత్మరక్షణకు కరాటే దోహదం

డీవైఎస్‌ఓ నర్సయ్య, సీఐ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదం చేస్తుందని డీవైఎస్‌ఓ నర్సయ్య, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్, జిల్లా కరాటే షోటోకన్ స్టైల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కరాటే వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన వారు మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వల్ల శారీరకగాను, మానసికంగాను ఎంతో దృఢంగా ఉంటారన్నారు. అలాగే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని, చిన్నారులంతా యుద్ధ విద్యలు తప్పనిసరిగా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో ప్రతిభ చూపితే భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.



కరాటే శిక్షకులతో డీవైఎస్‌ఓ నర్సయ్య, సీఐ దుర్గ

అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. అదే విధంగా సమ్మర్ క్యాంపులో ఉచిత కరాటే శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. కారక్రమంలో జగిత్యాల జిల్లా చీఫ్ కరాటే మాస్టర్ ప్రవీణ్ కుమార్, సిద్దిపేట జిల్లా చీఫ్ రాచకొండ ఆంజనేయులు, జిల్లా జోనల్ చీఫ్ భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ భారత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత్‌నగర్, విక్టరీ టాకీస్ చౌరస్తా, రైతుబజారు, సెంట్రల్ బ్యాంక్ ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

20లోగా దరఖాస్తు చేసుకోండి

దుబ్బాకటౌన్: రైతు భరోసా పథకంలో భాగంగా వానాకాలం పెట్టుబడి సాయం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని రాయపోల్ మండల వ్యసాయాధికారి నరేశ్ మంగళవారం తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ

దుబ్బాకటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఏఎంసీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మానంజిగారి మల్లేశం కుమారుడు ఛత్రపతిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఛత్రపతి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం యశోద ఆస్పత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

9న దేశవ్యాప్త సమ్మె

సిద్దిపేటఅర్బన్: దేశవ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజు, చంద్రయ్య, బాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం బృందం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి హన్నాల్

కొండపాక(గజ్వేల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణ తీరును ఎన్‌ఎల్‌ఎం బృందం క్షేత్రస్థాయి పరిశీలించింది. మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో ఈజీఎస్ పథకంలో జరుగుతున్న పనులను జాతీయ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రాజెక్టు అధికారి హన్నాల్‌తో పాటు నాబార్డు లెవల్ మానిటరింగ్ బృందం పరిశీలించింది. పనుల వల్ల లబ్ధి పొందుతున్నారా, పనులు కల్పించడంలో అధికారుల తీరు ఎలా ఉందని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే చోట నీడ, తాగునీరు లాంటి వసతులు కల్పిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. సకాలంలో డబ్బులు జమవుతున్నాయా? ఎప్పటికప్పుడు వివరాలను ఈజీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా అనే విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హన్నాల్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా కూలీలకు పనులు కల్పించాలన్నారు. పనుల్లో పారదర్శకతలు లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జగదేవ్ ఆచార్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈజీఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, పంచాయితీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సు తప్పని సరి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సూచించారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మంగళవారం పబ్లిక్ టాయిలెట్లను పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వస్త్ర వ్యాపారులు, ట్రేడర్స్, చికెన్, మటన్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు చెత్తను మున్సిపల్ వాహనానికి అందించి స్వచ్ఛతకు సహకరించాలన్నారు. ప్రజలు పబ్లిక్ టాయిలెట్లనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు బూర్ల రాజయ్య, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు బాలకిష్టయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ పృథ్వి, మేనేజర్ సంపత్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ముగిసిన రెవెన్యూ సదస్సులు

కొమురవెల్లి(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో తహసీల్దార్ దివ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీఓ సదానందం మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో సదస్సులు పూర్తయ్యాయన్నారు. మొత్తం 986 మంది రైతులు తమ సమస్యల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓకు విన్నవించారు. అలాగే మద్దూరు మండలంలో 577 దరఖాస్తులు, దూల్మిట్ట మండలంలో 687 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్లు మధుసూదన్, రహీం తెలిపారు.

◆ దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: ఏబీవీపీ కార్యకర్త ఆదిత్యపై దాడిచేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని జాతీయ కార్యదర్శి శ్రవణ్ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్త ఆదిత్యపై దాడి చేయడం బాధాకరం అన్నారు. రాంబాబు, పవన్, ఫణీంద్ర, బీరకాయల వివేక్, చరణ్, రాజు, రాకేశ్, రాహుల్, వసంత్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): యోగాతోనే సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తుందని యూనానీ డాక్టర్ నసీమున్నిసా అన్నారు. మండల పరిధిలోని అల్వాల– చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు యోగా, పౌష్టికాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యోగా ట్రైనర్ స్వప్న విద్యార్థుతో యోగాసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ రఘునందన్‌రావు, ఫార్మసిస్టు నరేష్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

◆ సేవలు అభినందనీయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేద, అనాథ పిల్లల విద్యాభివృద్ధికి రిలయబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఆనంద్ అన్నారు. ఎల్లాయిగూడలో విజయలక్ష్మీ మెమోరియల్ స్టోన్ బ్రిడ్జి స్కూల్‌లో ఆశ్రయం పొందుతున్న 250 మంది విద్యార్థుల పోషణకు ట్రస్ట్ ద్వారా సమకూర్చిన రూ.6లక్షల సామగ్రిని అందజేశారు. ఎంఈఓ సత్తయ్య, పాఠశాల వ్యవస్థాపకుడు కెలెబ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బుక్ స్టాళ్లల్లో తనిఖీలు చేపట్టాలి

హుస్నాబాద్: ప్రైవేట్ స్కూళ్ల యజమానులు ప్రత్యేకంగా బుక్‌స్టాళ్లను ఏర్పాటు చేసుకుని దోపిడీ చేస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ ఆరోపించారు. బుక్‌స్టాళ్లల్లో తనిఖీలు చేపట్టాలని ఎంఈఓ మనీలకు మంగళవారం ఆయన వినతిపత్రం ఇచ్చారు. రెండో తరగతి చదువుకునే విద్యార్థికి రూ.5వేలు విలువల గల పుస్తకాలు అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



జగదేవ్‌పూర్‌లో చిన్నారులతో సూపర్‌వైజర్ భవాని, తల్లిదండ్రులు, టీచర్లు

నూతన విద్యావిధానంతో సృజనాత్మకత

సీడీపీఓ శారద

సిద్దిపేటఅర్బన్/మిరుదొడ్డి(దుబ్బాక)/నంగునూరు(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్)/సిద్దిపేటజోన్: అంగన్‌వాడీ కేంద్రాలలో నూతన విద్యా విధానం అమలు కావడం చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుందని సిద్దిపేట సీడీపీఓ శారద అన్నారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో చిన్నారులకు వినూత్న రీతిలో రైమ్స్, కథలు, ఆంగ్ల అక్షరాలు నేర్పిస్తున్నారన్నారు. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. ప్రాజెక్టు పరిధిలోని 267 అంగన్‌వాడీ కేంద్రాలలో దశలవారీగా అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సూపర్‌వైజరు సునీత, టీచర్స్ సరోజన, లావణ్య, లత, విజయ తదితరులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు అంగన్‌వాడీలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక సీడీపీఓ ఎల్లయ్య సూచించారు. మండల పరిధిలోని అల్వాల అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా పేర్లు నమోదు చేయించుకున్న చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్ రేణుక, టీచర్ విజయ, ఆయా పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం బద్దిపడగలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్, టీచర్లు విజయలక్ష్మి, లలిత, శ్రీలత, రాజేశ్వరి, సంధ్య తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ భవాని చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో టీచర్ సంతోష, ఆయా, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సిద్దిపేట 43వ వార్డులో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ పూర్ణిమఎల్లం మాట్లాడుతూ కేంద్రంలో లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలను కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వప్న, టీచర్లు శ్వేత సురేఖ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటఅర్బన్: చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ శారద తదితరులు

ప్రజల సహకారం అవసరం

గజ్వేల్ ఏసీపీ నర్సింహులు



ములుగు(గజ్వేల్): మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహులు

ములుగు(గజ్వేల్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు కోరారు. మండలంలోని కొత్తూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎవరైనా ఒత్తిడి చేస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలా ఉండాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, షీ టీం సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దిగొద్దు..

మద్దూరు(హుస్నాబాద్): గొడవలు పడకుండా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని చేర్యాల సీఐ శ్రీను సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి రాబోయే స్థానిక ఎన్నికలలో ఎలా ఉండాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని, ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎస్ఐ షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

తపాస్‌పల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి గ్రామస్తులు అధికారులు, పోలీసులకు సహకరించాలని ఎస్ఐ రాజు కోరారు. మండలంలోని తపాస్‌పల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామంలోని పెద్దలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తొగుట(దుబ్బాక): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి అన్నారు. తొగుటలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చిత్ర పటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భారత్‌తేజ, భూపాల్‌రెడ్డి, రవీందర్, నర్సింహులు, స్వామి తదితరులు పాల్గొన్నారు. రైతు వేదికలో దుబ్బాక డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్లకు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం కల్పించాలన్నారు. ఆత్మకమిటీ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారి మోహన్, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థిదశ నుంచే క్రమశిక్షణ అవసరం

టూటౌన్ సీఐ ఉపేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: విద్యార్థి దశలో ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ అవసరమని టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో షీ టీమ్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేశారన్నారు. ఎవరైనా అవహేళన చేసినా, వేధించినా ఒక చిట్టీరాసి బాక్స్‌లో వేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, షీ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అలవర్చుకోవాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థిదశ నుంచే ట్రాఫిక్ నిబంధనలు అలవర్చుకోవాలని ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో జీడీఆర్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో సీఐ ఉపేందర్, షీ టీమ్ బృందం తదితరులు

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

మున్సిపల్ అధికారుల అవగాహన

చేర్యాల(సిద్దిపేట): వర్షాకాలం ప్రారంభమవుతున్న తరుణంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక చర్య ఒక మార్పు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా వివిధ వార్డుల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించడంపై వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు. విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నరేందర్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.